ఈనాడు
తిరుపతి
సోమవారం అక్టోబరు 14, 2024



కనుల పండువగా భాగ్ సవారి



తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారికి ఏడాదిలో నిర్వహించే ఉత్సవాల్లో ఒకటైన భాగ్ సవారి ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాలు పూర్తయిన మరుసటిరోజు దీనిని నిర్వహించడం ఆనవాయితీ. స్వామివారు సాయంత్రం 4 గంటలకు వైభవోత్సవ మండపం నుంచి బయలుదేరి అప్రదక్షిణంగా అనంతాళ్వారు తోటకు చేరి అక్కడ ప్రత్యేక పూజలందుకొని తిరిగి ఆలయంలోకి ప్రవేశించడంతో వేడుక ముగిసింది.

ఆగమోక్తంగా చక్రస్నానం ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శనివారం రాత్రి బంగారు తిరుచ్చి ఉత్సవం వైభవంగా జరిగింది. అనంతరం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. అంతకుముందు తెల్లవారు జామున స్వామివారికి పల్లకీ ఉత్సవం జరిగింది. అనంతరం శ్రీభూవరాహ స్వామి ఆలయ ముఖ మండపంలో భూదేవి, శ్రీదేవి సమేత శ్రీమలయప్పస్వామి, శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం, చక్రస్నానం నిర్వహించారు. శ్రీవారి పుష్కరిణిలో సుదర్శన చక్రాన్ని పవిత్ర జలంలో ముంచి స్నానం చేయించారు. భారీగా భక్తులు స్నానమాచరించారు.





జపాన్ దేశ చిన్నారులకు గోవింద నామాలు

పొంచి ఉన్న తుపాను ముప్పు



నేటి నుంచి 4 రోజులు భారీ వర్షాలు

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడనున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ మీదుగా ద్రోణి ప్రయాణించే అవకాశం ఉండటంతో అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. 14, 15, 16, 17న భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. సముద్ర తీర ప్రాంతాల్లో గంటకు 55 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని, జాలర్లు వేటకు వెళ్లకూడదని వాతావరణ శాఖ హెచ్చరించింది.

- అధికారులు, సిబ్బంది సెలవుల్లో ఉంటే వెంటనే రద్దు చేసుకొని విధుల్లో చేరాలి. 24 గంటలపాటు ప్రజలకు అందుబాటులో ఉండాలి. రహదారులపై నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటే ప్రజల రాకపోకలపై ఆంక్షలు విధించడం వంటి చర్యలు చేపట్టాలి.
- జలపాతాలు, నీటి ప్రవాహాల వద్దకు సందర్శకులను అనుమతించవద్దని, నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెకర్ వెల్లడించారు. ఎస్పీ మాట్లాడుతూ.. గాలులకు చెట్లు కూలితే తొలగించేందుకు మొబైల్ వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు సమర్థంగా నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు.
- అనంతరం నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నిండితే తీసుకోవాల్సిన చర్యలపై ఆయన చర్చించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, చిత్రంలో ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ : అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 0877-2236007ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

జిల్లాలో పునరావాస కేంద్రాల ఏర్పాటు: కలెక్టర్

జిల్లా పరిధిలో సోమవారం నుంచి నాలుగు రోజులపాటు భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయని, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా. వెంకటేశ్వర్ హెచ్చరించారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం భన్సల్, డీఆర్వో పెంచల్ కిషోర్‌తో కలిసి సమీక్షించారు. జిల్లా పరిధిలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, యుద్ధప్రాతిపదికన సహాయ కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గూడూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని చిల్లకూరు, వాకాడు, కోట, సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్‌లోని తడ తదితర తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

లక్కు.. కిక్కు ఎవరికో..!

- **227 దుకాణాలకు 3,920 దరఖాస్తులు**
- **మద్యం దరఖాస్తుల రాబడి రూ.78.40 కోట్లు**



తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: మద్యం దుకాణాల కేటాయింపు నిమిత్తం నిర్వహించే లాటరీలో లక్కు ఎవరికో నేడు తేలనుంది. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం విధానానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ దుకాణాలకు బదులు ప్రైవేటు మద్యం దుకాణాల కేటాయింపునకు టెండర్లు ఆహ్వానించింది. దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో స్వీకరించగా జిల్లాలోని 227 దుకాణాలకు 3,920 దరఖాస్తులు అందాయి. రూ. 78.40 కోట్ల రాబడి అందింది.

- జిల్లాలో సరాసరి ప్రతి దుకాణానికి 17 దరఖాస్తుల చొప్పున అందాయి. తిరుపతి అర్బన్ పరిధిలోని ప్రతి మద్యం దుకాణానికి 30 దరఖాస్తుల వరకు వచ్చాయి. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, చిల్లకూరు, నాయుడుపేట, సూళ్లురుపేట, పాకాల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతి దుకాణానికి పదిలోపు దరఖాస్తులు అందాయి. ఈ ప్రాంతాల్లో వ్యాపారులపై కొంతమేరకు ఒత్తిడి ఉన్నట్లు ప్రచారం జరిగింది. దానికితోడు రూ. రెండు లక్షలు దరఖాస్తు రుసుం విధించడంతో ఎక్కువమంది ముందుకు రాలేకపోయారనే ప్రచారం జరిగింది.

వరుసగా ముగ్గురి ఎంపిక

ప్రతి దుకాణానికి లక్కీ డిప్‌లో ముగ్గురిని ఎంపిక చేయనున్నారు. ఎంపికైన మొదటి వ్యక్తి ఆ వెంటనే లైసెన్సు ఫీజును చెల్లించి దుకాణాన్ని దక్కించుకోవాలి. ఆలస్యమైనా, అదే రోజున ఫీజు చెల్లించలేకపోయినా ఎంపికైన ముగ్గురిలో రెండో వ్యక్తికి అవకాశం ఇస్తారు. రెండో వ్యక్తి అధికారులు నిర్దేశించిన సమయంలోగా లైసెన్సు ఫీజు చెల్లించాలి. అతడు సైతం చెల్లించకపోతే మూడో వ్యక్తికి అవకాశం దక్కనుంది. ఈ ఫీజుల చెల్లింపు కోసం ఎస్‌బీఐ అధికారులు సైతం కల్యాణ మండపంలోనే అందుబాటులో ఉంటారు.

6 గంటలకే రావాలి

దరఖాస్తుదారులు లాటరీ నిర్వహించే శిల్పారామం సెంట్రల్ హాల్‌లోకి సోమవారం ఉదయం 6 గంటలకే రావాలని జిల్లా ఈఎస్ నాగమల్లీశ్వరరెడ్డి పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న సమయంలో డౌన్‌లోడ్ చేసుకున్న ఫారం ఏ3 - బి, రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం, ప్రవేశ పాసు, అభ్యర్థి ఆధార్ నకలు, అభ్యర్థి తరపున ప్రతినిధి వస్తే ధ్రువపత్రంతోపాటు ప్రతినిధి ఆధార్ నకలు, పాన్ కార్డు నకలు తీసుకురావాలని కోరారు. తిరుపతి డివిజన్ అభ్యర్థులు సెంట్రల్ హాల్ 1లోకి, గూడూరు డివిజన్ అభ్యర్థులు సెంట్రల్ హాల్ -2లోకి రావాలని సూచించారు.

లాటరీకి సర్వం సిద్ధం

సోమవారం ఉదయం 8 గంటలకు తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో మద్యం దుకాణాలకు కలెక్టరు వెంకటేశ్వర్ లాటరీ తీసి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, శ్రీకాళహస్తి, పుత్తూరు, నాగలాపురం, చంద్రగిరి ఎక్సైజ్ స్టేషన్లకు సంబంధించిన హాల్ నెంబరు 1లో లాటరీ నిర్వహిస్తారు. గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వాకాడు, వెంకటగిరి ఎక్సైజ్ స్టేషన్లకు సంబంధించిన హాల్ నెంబరు 2లో లాటరీ నిర్వహిస్తారు.

శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: టికెట్లు లేకుండా ఆదివారం సాయంత్రానికి తిరుమల వచ్చిన భక్తులకు 24 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. శనివారం చక్రస్నానం అనంతరం శ్రీవారిని దర్శించుకునే వారితో ఆదివారం రద్దీ పెరిగింది. రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల భక్తులకు 3 గంటలు పడుతోంది. శనివారం శ్రీవారిని 73,684 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ. 2.72 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

తితిదేలో త్వరలో మరిన్ని బదిలీలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిసిన నేపథ్యంలో తితిదేలో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ పునఃప్రారంభం కానుంది. సెప్టెంబర్ రెండో తేదీన 19 మంది ఏఈవోలు, 62 మంది సూపరింటెండెంట్లను బదిలీ చేశారు. ఇదే సమయంలో దిగువస్థాయి సిబ్బంది 350 మందికి పైగా బదిలీలకు సంబంధించిన కసరత్తు జరిగింది. అయితే అప్పట్లో కొన్ని ఒత్తిళ్ల కారణంగా యూడీసీ, ఎల్డీసీ, షరాబు, అటెండర్ స్థాయి బదిలీ ప్రక్రియ ఆగింది. ప్రస్తుతం ఇది మళ్లీ ప్రారంభం కానున్నట్లు సమాచారం. సోమవారం దేవస్థానం ఉద్యోగుల సహకార బ్యాంకు ఎన్నికల ప్రకటన వెలువడనుంది. 28వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియ ఎన్నికల అనంతరం నిర్వహించాలా లేక ఈ మధ్యలోనే పూర్తిచేయాలా అనే అంశంపై మీమాంస నెలకొంది. దీనిపై త్వరలో స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది.

నారా భువనేశ్వరి పర్యటన వాయిదా



కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సీఎం నారా చంద్రబాబు నాయుడి సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి నాలుగు రోజుల కుప్పం పర్యటన వాయిదా పడింది. ఈ మేరకు కుప్పం తెదేపా వర్గాలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపాయి. సోమవారం నుంచి ఆమె కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు పలమనేరు నియోజకవర్గం వి.కోటలో పర్యటించాల్సి ఉంది. ఈ మేరకు పర్యటన పార్టీ వర్గాలు ఖరారు చేసి షెడ్యూల్ సైతం ప్రకటించారు. అయితే సోమవారం నుంచి తుపాను కారణంగా పర్యటన వాయిదా పడినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ డా. వెంకటేశ్వర్ తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు.

అటకెక్కిన అరణియార్ ఆధునికీకరణ



జలాశయంలో మట్టి తవ్వకాలతో ఏర్పడ్డ గుంతలు

- అందుబాటులో రూ.35.6 కోట్లు
- చేతులెత్తేసిన గుత్తేదారు
- వర్షాలు పడితే పనులకు తప్పని తంటాలు

అరణియార్ అభివృద్ధి అందని ద్రాక్షగానే మిగిలింది. సిమెంటు కాలువలు, రక్షణగోడ, చెరువుల ఆధునికీకరణకు విడుదలైన రూ.35.6 కోట్ల నిధులు కాగితాలకే పరిమితం అయ్యాయి. పిచ్చాటూరులో రూ.1.28 కోట్ల వ్యయం, 1.853 టీఎంసీల సామర్థ్యంతో నిర్మితమైన జలాశయంపై గత పాలకుల నిర్లక్ష్యం రైతులకు శాపంలా పరిణమించింది. స్పిల్‌వే గేట్ల నిర్మాణానంతరం జైకా నిధులతో పూర్వవైభవం సాధ్యమవుతుందని రైతులు ఆశించినా ఫలితం కనిపించడం లేదు. - న్యూస్‌టుడే, నాగలాపురం

కాలువలు సరేసరి

కుడి కాలువ 4.14, ఎడమ కాలువ 4.73 కి.మీ. ఉంది. కి.మీ. నిడివి ఉన్న మధ్య కాలువ నుంచి పిచ్చాటూరులోని ఆయకట్టుకు నీరు రావాల్సి ఉంది. రామగిరి ఊట కాలువ నుంచి నల్లచెరువుకు 6 కి.మీ. పొడవున్న కాలువ పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారింది. సీసీతో ఆధునికీకరించేందుకు ఎడమ కాలువలో మాత్రం కొంతమేర పనులు జరిగాయి. కుడి కాలువ, మధ్య కాలువలో పనిచేసిన దాఖలాలు లేవు.



పిచ్చిమొక్కలతో అధ్వానంగా కుడి కాలువ

మట్టి రవాణా జోరు

అరణియార్‌లో మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. జలాశయంలో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఫలితంగా జలాశయం అంచుల్లో పెద్దఎత్తున గుంతలు ఏర్పడి వరద ప్రవాహంతో ప్రమాదం నెలకొనే పరిస్థితులున్నాయి. జలాశయ అధికారులందరూ సాధారణ బదిలీల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లడం.. నూతన అధికారుల రాక నేపథ్యంలో ఇకనైనా పనుల్లో వేగం పెంచడంపట్ల దృష్టి సారించాల్సి ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకుని జలాశయానికి పూర్వవైభవం తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

జైకాకు లేదు హామీ

జైకా పనులు దక్కించుకున్న గుత్తేదారు తొలుత వేగంగా పనులు ప్రారంభించినా వైకాపా ప్రభుత్వ హయాంలో బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యం నెలకొంది. పాక్షికంగా ఎడమ కాలువ, రక్షణ గోడ పనులను చేసి ఏడాదిన్నర కిందట పనులు ఆపేశారు. నోటీసులకు సైతం స్పందించ లేదు. 12 వేల ఎకరాల ఆయకట్టు పరిధిలో మూడు పంటలు పండాల్సి ఉండగా సవ్యంగా నీరందే పరిస్థితి లేదు.

పర్యాటక ప్రగతి ఏదీ?

జలాశయం వద్ద పర్యాటకరంగ అభివృద్ధికి గతేడాది రూ.1.82 కోట్ల తుడా నిధులతో చేపట్టిన పనుల్లోనూ ప్రగతి అంతంతమాత్రంగానే ఉంది. నీటిపారుదల శాఖ నూతన భవన నిర్మాణ పనులు పైకప్పు వరకే జరిగి ఏడాదిగా ఆగిపోవడంతో అధికారులకు వసతి కరవైంది.

వరద పనులకు మోక్షమేదీ?

- చెరువులకు తప్పని ముప్పు
- తుపాను హెచ్చరికలతో కలవరం

గూడూరు, న్యూస్‌టుడే : వరద నివారణ పనులు చక్కబెట్టడంలో వైకాపా ప్రభుత్వం విఫలమైంది. దెబ్బతిన్న చెరువులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో అవి ప్రమాదకరంగా మారాయి. గతేడాది వరదల సమయంలో పెద్దఎత్తున చెరువులు, కరకట్టలు దెబ్బతిన్నాయి. వాటికి నిధులు కేటాయించడంలో రాజకీయ జోక్యంతో అవసరం లేనిచోట్ల పనులు చేపట్టారు. దిగమింగేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రస్తుత తపాను హెచ్చరికల నేపథ్యంలో చెరువులు, నదీతీర ప్రాంతాల్లో కరకట్టలు ప్రమాదంలో ఉన్నాయి.

జిల్లాలో 2,583 చిన్ననీటి పారుదల చెరువులున్నాయి. వీటి పరిధిలో 1.07 లక్షల హెక్టార్ల ఆయకట్టు విస్తరించి ఉంది. అత్యధికంగా సూళ్లూరుపేట డివిజన్‌లో చెరువులు ఉండగా గతేడాది వరద నివారణకుగాను 195 పనులకు రూ. 16.05 కోట్లు విడుదలైంది. గూడూరు, శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ల పరిధిలో మరో రూ. 40 కోట్లు మంజూరుకాగా ఇవన్నీ రాజకీయ ప్రయోజనాల కోసం కేటాయించారు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో పనులు ప్రారంభించి మమ అనిపించారు.



ఇక్కడే అలుగు దుస్థితి



బాగు చేయని చెంబేడు చెరువు కట్ట

శాశ్వత పనుల జాడేది..

గతేడాది మిగ్‌జాం తుపానుకు చెరువులు, కాళంగి, స్వర్ణముఖి కరకట్టలు చాలాచోట్ల దెబ్బతిన్నాయి. వాటిని శాశ్వతంగా బాగు చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. చెరువు కట్టల్లో ఓజిలి మండలం పున్నేపల్లి చెరువు బాగు కోసం ఎఫ్‌డీఆర్ నిధులు రూ. 39 లక్షలు విడుదల కాగా టెండర్ల దశ దాటలేదు. పెళ్లకూరు మండలం చెంబేడు చెరువు కట్టపైకి నీరు చేరి ప్రమాదకరంగా మారినా నిధులివ్వలేదు. ఇదే తీరుగా వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం వద్ద స్వర్ణముఖి పొర్లుకట్ట పటిష్ఠ పనులు జరుగుతున్నాయి. ఇలా వరద నివారణ పనుల్లో రాజకీయ జోక్యం కారణంగా చెరువులు, వాగులు ప్రమాదకరంగా మారాయి.

ఆయా డివిజన్లలోని ఆయకట్టు

	చెరువులు	హెక్టార్లు
గూడూరు	534	32,538
శ్రీకాళహస్తి	606	30,399
సూళ్లూరుపేట	729	33,272
తిరుపతి	714	11,062

రైతుకు మిల్లర్ల టోకరా

- బస్తాకు రూ.265 నష్టం
- ధాన్యం సేకరణ కేంద్రాలు లేక తిప్పలు
- తూకాలు, ధరల్లో మోసం

పుత్తూరు మండలం తడుకు గ్రామానికి చెందిన రైతు ఆనందయ్య ఖరీఫ్‌లో ఐదెకరాల్లో వరి సాగు చేశాడు. ప్రభుత్వం ఇంకా ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అతడు ప్రైవేటు వ్యాపారులకు పొలంలోనే ధాన్యం విక్రయించాడు. గోతాంతో కలిపి 81 కేజీల తూకం వ్యాపారులకు ఇవ్వాలి. అయితే వ్యాపారులు తేమ శాతం ఉందని, ధాన్యం శుభ్రంగా లేదని 85 కేజీలు తీసుకుని మోసం చేస్తున్నారు. ఇది ఒక్క ఆనందయ్యకే జరిగిన మోసం కాదు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం వరి రైతుల దయనీయ స్థితి ఇది.. కేంద్ర ప్రభుత్వం క్వింటాలు కామన్ వెరైటీకి రూ.2,300, సన్న రకాలకు రూ.2,320 నిర్ణయించింది. ఈ మేరకు 80 కేజీల బస్తాకు రైతుకు రూ.1,840 దక్కాల్సి ఉన్నా.. రూ.1,575 చెల్లించి మిల్లర్లు కొనుగోలు చేస్తుండటంతో రైతుకు బస్తాకు రూ.265 వరకు నష్టం వాటిల్లుతోంది.

\- న్యూస్‌టుడే, పుత్తూరు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖరీఫ్‌లో 25వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు, నాయుడుపేట, గూడూరు, వడమాలపేట, పుత్తూరు, నాగలాపురం.. చిత్తూరు జిల్లాలోని నగరి, నిండ్ర, విజయపురం, కార్వేటినగరం మండలాల్లోనూ సాగైంది.. చిత్తూరు జిల్లా పరిధిలో ఆగస్టు, సెప్టెంబరు మొదటి వారంలోనే కోతలు మొదలయ్యాయి. తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లో కోతలు పూర్తయ్యాయి. ధాన్యం సేకరణకు ఏర్పాట్లు లేక రైతులు బస్తాకు రూ. 265 నష్టపోతున్నారు. ఎకరాకు 30 బస్తాలు దిగుబడి అనుకున్నా రూ. 7,950 నష్టపోవాల్సి వస్తోంది. తూకాల్లో మోసంతో బస్తాపై రూ. 115 నష్టం వెరసి.. ధర, తూకాల్లో ఎకరాకు రూ. 11,400 నష్టపోతున్నారు. ఐదెకరాల రైతు ఏకంగా రూ. 57వేలు నష్టపోతున్నారు. తీర మండలాల్లో ఒక్కో రైతు 20 నుంచి 30 ఎకరాలు సాగు చేస్తుండగా రూ. లక్షల్లో నష్టపోతున్నారు. ఇదంతా దళారులు, వ్యాపారుల జేబుల్లోకి పోతోంది.



ఆరబోసిన ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న రైతులు

తేమ పేరుతో..

ధాన్యంలో తేమ పేరుతో ఒక్కో బస్తాకు 4 నుంచి 5 కేజీలు వ్యాపారులు రైతులను ఏమార్చి తూకాల్లో మోసం చేస్తున్నారు. దీనికి తోడు ఒక్కో రైతుకు ఒక్కో ధర చెల్లిస్తున్నారు. పంట పరిశీలించి ఓ ధర చెప్పేసి అడ్వాన్స్ ఇస్తున్నారు. తీరా కోతలు అయ్యాక ఎక్కువ తేమ, చెత్తాచెదారాలు ఉన్నాయని ధర తగ్గిస్తున్న సందర్భాలు అనేకం. ఇలా రైతులను మోసం చేస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

అలయ్‌ బలయ్‌కు వెళ్లలేదు: నారాయణ

నగరి, న్యూస్‌టుడే: హరియాణా గవర్నర్‌ బండారు దత్తాత్రేయ రాజకీయాలకు అతీతంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అలయ్‌ బలయ్‌ కార్యక్రమానికి తాను వెళ్లలేదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్‌ కె.నారాయణ పేర్కొన్నారు. తన స్వగ్రామం అయినంబాకంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ దిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్‌ సాయిబాబా మరణం నేపథ్యంలో తానీ నిర్ణయం తీసుకున్నానని ప్రకటించారు. సాయిబాబా మరణానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఇది ముమ్మాటికీ సర్కారు హత్యేనని, సహజ మరణంగా పరిగణించలేమని ఆరోపించారు. కోర్టు తీర్పులో సాయిబాబాకు, మావోయిస్టులకు మధ్య సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని చెప్పినా, ఆయన్ను జైల్లో ఉంచి మానసికంగా, భౌతికంగా వేధించి మరణానికి కారణమయ్యారని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కారణంగా దత్తాత్రేయ నిర్వహించే అలయ్‌ బలయ్‌ ఆహ్వానాన్ని తాను సున్నితంగా తిరస్కరించానని పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

పండగ వేళ పలు కుటుంబాల్లో తీరని విషాదం మిగిలింది. శని, ఆదివారాల్లో జరిగిన ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. ఆపదలో ప్రాణాలు పోసే 108 ఢీకొని ఓ విశ్రాంత ఉద్యోగి మృతిచెందగా ఓ వృద్ధురాలితోపాటు పాదచారి, ఓ ద్విచక్ర వాహనదారు ప్రాణాలు విడిచారు.


108 ఢీకొని విశ్రాంత ఉద్యోగి..



సుబ్రహ్మణ్యంరెడ్డి (పాతచిత్రం)

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: 108 వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందారు. తిరుపతి రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. పేరూరు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డి(62) ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాలలో ఉద్యోగిగా పని చేస్తూ రెండేళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. అతనికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. కొడుకు దుబాయ్‌లో పనిచేస్తున్నారు. సుబ్రహ్మణ్యం రెడ్డి పేరూరులో కొత్తగా గృహం నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం అదే గ్రామానికి చెందిన మేస్త్రి సుబ్బారావుతో కలసి ద్విచక్ర వాహనంపై పాతకాల్వ గ్రామానికి వెళ్లారు. అక్కడ మెటీరియల్‌ గురించి మాట్లాడుకుని తిరిగి పేరూరు గ్రామానికి వచ్చేందుకు పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలోని వకుళమాత ఆలయం వద్ద రోడ్డు దాటుతుండగా.. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గర్భిణిని కాన్పు నిమిత్తం తీసుకు వస్తున్న 108.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న సుబ్రహ్మణ్యం రెడ్డి రోడ్డుపై పడి తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక కూర్చున్న సుబ్బారావుకు గాయాలు కావడంతో మరో 108లో రుయాకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చిల్లకూరులో..



మధుసూదన్‌రెడ్డి (పాతచిత్రం)

చిల్లకూరు : వరగలి అడ్డరోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. గూడూరు మండలం పోటుపాలెం గ్రామానికి చెందిన పార్లపల్లి మధుసూదన్‌రెడ్డి (52) రైటర్‌సత్రం సమీపంలోని ఓ హోటల్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నారు. విధులకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందారు.. ఆదివారం వరగలి అడ్డరోడ్డు వద్ద రహదారి దాటుతున్న కృష్ణాపురం గిరిజన కాలనీకి చెందిన వృద్ధుడు బండి లక్ష్మయ్య(70)ను లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతను నెల్లూరుకు తరలించేలోగా మృతి చెందారు.

ఆటోను ఢీకొన్న కారు.. వృద్ధురాలు..

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట పరిధిలోని తుమ్మూరు జాతీయ రహదారిపై ఆటోను కారు ఢీకొనడంతో వృద్ధురాలు మృతి చెందగా.. మరికొందరు గాయపడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని అన్నమేడు గ్రామానికి చెందిన పలువురు ఆటోలో ఆదివారం సూళ్లూరుపేటలో ఓ పెళ్లికి హాజరై తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. నాయుడుపేట నరసారెడ్డికండ్రిగ క్రాస్‌ సమీపంలోకి రాగానే వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలోని శాంతమ్మ(68) మృతి చెందగా కృష్ణకుమారి, గోపాల్‌, జనార్దన్‌, రత్నమ్మ గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త కిడ్నాప్‌.. భార్య ఆత్మహత్య



చెంచులక్ష్మి (పాతచిత్రం)

న్యూస్‌టుడే, రాపూరు, డక్కిలి: భర్తని ఒక వ్యాపారి కిడ్నాప్‌ చేయడంతో ఎంత వేడుకున్నా వదిలి పెట్టకపోవడంతో భార్య శనివారం రాపూరు మండలం గిలకపాడు రోడ్డు వద్ద గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త రవి(ఉరఫ్‌ దావీద్‌) రాపూరు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా రాజంపేట సమీపంలోని మందరం కొత్తపల్లికి చెందిన సిమెంట్‌ రాళ్ల వ్యాపారి వెంకటసుబ్బారెడ్డి.. రవిని కిడ్నాప్‌ చేసి తీసుకెళుతుండగా రవి భార్య ఎంత వేడుకున్నా వదిలిపెట్టలేదు. జీవితంపై విరక్తి చెంది గుళికలు తినింది. చికిత్స నిమిత్తం రాపూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గూడూరు ఆసుపత్రికి తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందింది.

పండగకు వద్దన్నందుకే..

ఎస్‌ఐ రాజేశ్‌ మాట్లాడుతూ.. తిరుపతి జిల్లా డక్కిలి మండలం దందోలుకు చెందిన చెంచులక్ష్మి(30)కి ఆమె భర్త రవి మధ్య తలెత్తిన వివాదమే ఆత్మహత్యకు కారణమన్నారు. దంపతులిద్దరినీ సుబ్బారెడ్డి సిమెంట్‌ రాళ్ల తయారీ పని కోసమని 20 రోజుల క్రితం కొత్తపల్లికి తీసుకెళ్లాడు. యజమాని వద్ద రవి రూ.76 వేలు తీసుకొని రూ.20 వేలు చెల్లించాడు. సెప్టెంబరులో రవి దంపతులు అక్కడి నుంచి గిలకపాడుకు వచ్చారు. సుబ్బారెడ్డి వచ్చి రవిని మాత్రమే బలవంతంగా తీసుకెళ్లాడు. ఈ క్రమంలో రవి ఫోన్‌ చేసి భార్య చెంచులక్ష్మిని దసరాకు పండగకు రమ్మని పిలిచాడు. తీరా దసరా రోజున పోయేందుకు భార్య సిద్ధం కాగా భర్త ఫోన్‌ చేసి ఇప్పుడు వద్దని చెప్పడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్‌ఐ పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు తలకోనకు రాకపోకల నిలిపివేత

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రముఖ పర్యాటక కేంద్రమైన తలకోన సందర్శనకు సోమవారం పర్యాటకులను అనుమతించడం లేదని అధికారులు తెలిపారు.



ఘనంగా పార్వేట ఉత్సవం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీదేవి నవరాత్రి వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత సోమస్కందమూర్తి ఉత్సవమూర్తులను చప్పరాలపై ఊరేగించారు. పట్టణ సరిహద్దు ప్రాంతమైన కాసా గార్డెన్‌ వరకు అడుగడుగునా భక్తులు ఉత్సవమూర్తులకు స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ విశేషోత్సవం సందర్భంగా ఉత్సవం ముందు 108 దుర్గలతో చిన్నారులు, యువతులు విశేష ప్రదర్శనగా తరలిరావడం మరింత శోభాయమానంగా సాగింది. ఈవో చంద్రశేఖర్‌ ఆజాద్‌ ఇతర అధికారులు పాల్గొన్నారు.

టెట్‌కు 2,225 మంది హాజరు

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఐదు కేంద్రాల్లో జరిగిన టెట్‌కు మొత్తం 2,225 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 1,549 మందికి గాను 1,285 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షను 940 మంది రాశారు.

నేడు, రేపు ఎస్వీయూలో పీజీ ప్రవేశాలు

తిరుపతి(బైరాగిపట్టెడ) : శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఎంకామ్‌, ఎమ్మెస్సీ విభాగాల్లో ఖాళీగా ఉన్న సీట్లకు సోమ, మంగళ వారాల్లో స్పాట్‌ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్‌ ఆచార్య భూపతినాయుడు తెలిపారు. వివరాలకు డీవోఏ డైరెక్టర్‌ రమేష్‌బాబును 0877-2248589 నంబరులో సంప్రదించాలని చెప్పారు. అలాగే ఎస్వీయూ పరిధిలో ఆర్‌సెట్‌-2023-24 ద్వారా పీహెచ్‌డీ సీట్లు పొందిన అభ్యర్థులు కూడా ధ్రువపత్రాలతో డీవోఏ కార్యాలయంలో ఈ నెల 19 లోపు రిపోర్టు చేయాలని కోరారు.



ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ రవినాథ్‌ తిల్హారి



ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ వెంకట జ్యోతిర్మయి

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌ సమయంలో శ్రీవారి మూలమూర్తిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్‌ రవినాథ్‌ తిల్హారిలు వారివారి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు శ్రీవారి చక్రస్నాన మహోత్సవంలో పాల్గొని స్వామివారి పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేశారు.

తిరుమలేశుని దర్శించుకున్న ప్రముఖులు



ఆలయం ఎదుట బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి



కుటుంబ సభ్యులతో కలెక్టర్‌ వెంకటేశ్వర్‌



ఎస్పీ సుబ్బరాయుడు



చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని పలువురు ప్రముఖులు శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌ దర్శన సమయంలో శ్రీవారి మూలమూర్తిని సినీ నటుడు బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి, తిరుపతి కలెక్టర్‌ వెంకటేశ్వర్‌, ఎస్పీ ఎల్‌.సుబ్బరాయుడు, ఐపీఎస్‌ అధికారి ఆవుల రమేష్‌రెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కాకినాడ రూరల్‌ ఎమ్మెల్యే పంతం నానాజీ దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

తుపాను నేపథ్యంలో ప్రత్యేక బృందాల ఏర్పాటు

పుత్తూరు, న్యూస్‌టుడే: రానున్న నాలుగు రోజులు పాటు తుపాను నేపథ్యంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో కలెక్టర్‌ ఆదేశాల మేరకు పుత్తూరు మున్సిపల్‌ కార్యాలయంలో హెల్ప్‌లైన్‌, తుపాను రక్షక బృందం ఏర్పాటు చేశామని మున్సిపల్‌ కమిషనర్‌ మంజునాథ్‌గౌడ్‌ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పురపాలికలో హెల్ప్‌లైన్‌ నంబర్లు 70750 67503, 79899 95876 ఏర్పాటు చేశామన్నారు. రెండు టీంలు ఏర్పాటు చేశామన్నారు. ఒక టీమ్‌ను అసిస్టెంట్‌ ఇంజినీరు కార్తికేయ, రెండో టీమ్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాసులుబాబు పర్యవేక్షిస్తారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

డిగ్రీ నాలుగో సెమిస్టర్‌ ఫలితాల విడుదల

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన డిగ్రీ నాలుగో సెమిస్టర్‌ పరీక్ష ఫలితాలు శనివారం విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి దామ్లానాయక్‌ తెలిపారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్లో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.


ఉమ్మడి చిత్తూరు స్కూల్‌గేమ్స్‌ ప్రణాళిక

చిత్తూరు (క్రీడలు): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ నెలలో నిర్వహించనున్న క్రీడాపోటీల షెడ్యూల్‌ను స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ (ఎస్‌జీఎఫ్‌) కార్యనిర్వాహక కార్యదర్శి వసంతవాణి ఆదివారం విడుదల చేశారు. క్రీడాంశాలు, తేదీ, వేదికల వివరాలిలా..

■ **14న అండర్‌-17 ఫెన్సింగ్‌ :** జడ్పీ ఉన్నత పాఠశాల, యాదమరి ■ **15న.. అండర్‌-14, అండర్‌-17 ఆర్చరీ** - ఖజానా టైల్స్‌, మంగళం రోడ్డు తిరుపతి. అండర్‌-17 జుడో, అండర్‌-14, అండర్‌-17 టాన్‌ టెన్నిస్‌, అండర్‌-14, అండర్‌-17 రాఫెల్‌ షూటింగ్‌-శ్రీనివాసా స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌(తిరుపతి), అండర్‌-14 ఫెన్సింగ్‌-జడ్పీహెచ్‌ఎస్‌ సిద్ధంపల్లె (చిత్తూరు), అండర్‌-17 క్రికెట్‌-ఎస్‌ఆర్‌ఆర్‌ జీహెచ్‌ఎస్‌-పుత్తూరు ■ **17న.. అండర్‌-14 ఫుట్‌బాల్‌**-అపోలో ఇషా విద్యాలయ-అరగొండ, అండర్‌-14, అండర్‌-17 బాస్కెట్‌బాల్‌, అండర్‌-17 ఖోఖో-డీఎస్‌ఏ గ్రౌండ్‌(చిత్తూరు), అండర్‌-14, అండర్‌-17 యోగా-బాలుర జడ్పీహెచ్‌ఎస్‌ (శ్రీకాళహస్తి), అండర్‌-14 షటిల్‌ బ్యాడ్మింటన్‌-జీపీ ప్లే ఫిట్‌-తిరుపతి, సాఫ్ట్‌ టెన్నిస్‌-బాలుర జడ్పీహెచ్‌ఎస్‌-శ్రీకాళహస్తి ■ **18న.. అండర్‌-17 షటిల్‌ బ్యాడ్మింటన్‌** - జీపీ ప్లే ఫిట్‌(తిరుపతి), అండర్‌-14 హ్యాండ్‌బాల్‌-జడ్పీహెచ్‌ఎస్‌ సిద్ధంపల్లె(చిత్తూరు మండలం), అండర్‌-14 ఖోఖో-జడ్పీహెచ్‌ఎస్‌ పుంగనూరు ■ **19న.. అండర్‌-17 కబడ్డీ** - జడ్పీహెచ్‌ఎస్‌ చౌడేపల్లె, అండర్‌-14 బాల్‌బ్యాడ్మింటన్‌-జడ్పీహెచ్‌ఎస్‌ మహల్‌, కలికిరి. అండర్‌-14, 17 చెస్‌-శ్రీనివాసా స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌-తిరుపతి ■ **22న.. అండర్‌-14 హాకీ పోటీలు** -ప్రభుత్వ ఉన్నత పాఠశాల-చంద్రగిరి ■ **26న అండర్‌-17 రెజ్లింగ్‌** - జడ్పీహెచ్‌ఎస్‌-యాదమరి, అండర్‌-14, అండర్‌-17 టేబుల్‌ టెన్నిస్‌-బృందావన్‌ పాఠశాల సంతపేట (చిత్తూరు), అండర్‌-14 వాలీబాల్‌-జడ్పీహెచ్‌ఎస్‌ మదనపల్లె ■ **28న.. అండర్‌-14, అండర్‌-17 సైక్లింగ్‌** - జడ్పీహెచ్‌ఎస్‌ పూతలపట్టు, అండర్‌-14, అండర్‌-17 రూబి-ప్రభుత్వ ఉన్నత పాఠశాల-సత్యవేడు ■ **29న.. అండర్‌-14, అండర్‌-17 బేస్‌బాల్‌** - జడ్పీహెచ్‌ఎస్‌ మంగళం (ట్రెండ్స్‌) ■ **30న.. అండర్‌-14 నెట్‌బాల్‌** - జడ్పీహెచ్‌ఎస్‌ ఏకాంబరకుప్పం, అండర్‌-17 బాల్‌ బ్యాడ్మింటన్‌-పీసీఎన్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాల-నగరి, అండర్‌-14, అండర్‌-17 సాఫ్ట్‌బాల్‌-జడ్పీహెచ్‌ఎస్‌ ఈఆర్‌పేంట, బంగారుపాళ్యం.

వెంకాబ్‌ కోళ్ల ధరలు

బ్రాయిలర్‌ (రైతు ధర)	133
రిటైల్‌	155
లేయర్‌	120
బ్రాయిలర్స్‌	225
బ్రాయిలర్స్‌ స్కిన్‌ లెస్‌	256
లేయర్‌ మాంసం	204



తిరుమలపై వెళ్లిన విమానం

తిరుమల: తిరుమలపై విమానం వెళ్లిన ఘటన శనివారం చోటుచేసుకుంది. అప్పుడప్పుడు తిరుమల మీదుగా విమానాలు వెళ్తున్నాయి. కేంద్ర విమానయాన శాఖ గతంలోనే నో ఫ్లైయింగ్‌ జోన్‌గా తిరుమలను ప్రకటించడం కుదరదని తెలిపినట్లు సమాచారం.

తిరుపతి
• తిరుపతి • చంద్రగిరి

ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: ఈసారి తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు కనీవినీ ఎరుగని రీతిలో ఘనంగా జరిగాయని.. ఇందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే కారణమని తిరుపతి జనసేన ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ కొనియాడారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు.

ఫ్యామిలీ కోర్టును సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

తిరుపతి (లీగల్): తిరుపతి కోర్టు ప్రాంగణంలోని ఫ్యామిలీ కోర్టును ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి శనివారం సందర్శించారు. కోర్టు న్యాయమూర్తి జి.రామగోపాల్.. జస్టిస్‌కి ఘనంగా ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి చాంబర్‌ని, పబ్లిక్ కోర్టు హాలు, కార్యాలయాన్ని జస్టిస్ సందర్శించారు. ఫ్యామిలీ కోర్టు కేసుల సత్వర పరిష్కారం, పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోర్టు ఉద్యోగులు బాలసుబ్రహ్మణ్యం ఆచారి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రామచంద్రాపురం: తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అధికారులు అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ.. మూడ్రోజుల పాటు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ నంబరు 88863 48445కు సమాచారాన్ని అందించాలని సూచించారు. మండలంలోని రాయలచెరువును సందర్శించారు. ఎంపీడీవో ఇందిర, ఎంఈవో మార్కొండయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో న్యాయమూర్తి

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయం వద్ద అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆయనకు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

నగరపాలికలో కంట్రోల్ రూమ్

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తుపాను హెచ్చరిక నేపథ్యంలో తిరుపతి ప్రజల సౌకర్యార్థం నగరపాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. 24 గంటలు నగరపాలక సిబ్బంది అందుబాటులో ఉంటారని, తుపాను వల్ల ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూమును సంప్రదించి సహాయం పొందాలని కమిషనర్ కోరారు. సహాయం కావలసినవారు 0877- 2256766 నంబర్‌ను సంప్రదించాలని వివరించారు. సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు ఆమె ప్రకటించారు.

ప్రమాదాల కూడళ్లు..

కుటుంబాలకు కన్నీళ్లు

❖ వంతెనలు లేక పెరుగుతున్న ఘటనలు ❖ కూటమి ప్రభుత్వమైనా చొరవ చూపాలంటున్న ప్రజలు



రామానుజపల్లి వద్ద జాతీయ రహదారి కూడలిలో అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు

తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే: జాతీయ రహదారి కారణంగా మండలంలోని పలువురు ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. సంబంధిత శాఖ నిబంధనలు పాటించకుండా పాతికేళ్లకు ముందు నాయుడుపేట, పూతలపట్టు జాతీయ రహదారి నిర్మించింది. ఇది గ్రామీణ మండలానికి మధ్యలో సుమారు ఏడెనిమిది కి.మీ వెళుతోంది. ఫలితంగా తిరుపతి గ్రామీణ, రామచంద్రాపురం మండలాలతోపాటు పలువురి ప్రజలకు, వాహన చోదకులకు ప్రాణసంకటంగా మారింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో కుటుంబాలకు వెన్నుదన్నుగా ఉన్న పలువురు పెద్దలు ప్రాణాలు కోల్పోతున్న వైనమిది.

పాతికేళ్లకు ముందు వాజ్‌పేయీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నాయుడుపేట, పూతలపట్టు నాలుగు వరుసల రహదారి నిర్మించారు. తిరుపతి గ్రామీణ మండలంలోని దామినేడు నుంచి సి.మల్లవరం వరకు జాతీయ రహదారి సుమారు ఏడెనిమిది కి.మీ ఉంది. ఈ రహదారికి పక్కనే తిరుచానూరు, వేదాంతపురం, రామానుజపల్లి, వినాయకనగర్, పాతకాల్వ, గాంధీనగర్, సి.మల్లవరం గ్రామాలు ఉన్నాయి. దీనికి అనుసంధానంగా తిరుపతి గ్రామీణ, రామచంద్రాపురం మండలాలకు చెందిన సుమారు వందల గ్రామాల ప్రజలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి జాతీయ రహదారి మీదుగా వేల సంఖ్యలో వాహనాలు, ప్రజలు తిరుపతికి వస్తున్నారు. ఒక్క చోట వేదాంతపురం కూడలి వద్ద మాత్రమే పైవంతెన ఏర్పాటుకు జాతీయరహదారి అధికారులు ప్రణాళికలు పంపించారు. రహదారి నిర్మాణంలో భాగంగా ఇక్కడ నిర్మించాల్సిన వంతెనను తిరుచానూరు కూడలికి మార్చారు. పైవంతెన లేకపోవడంతో, రాత్రివేళ విద్యుత్తు దీపాలు లేక జాతీయ రహదారి మీద వేగంగా వచ్చే వాహనాలను అంచనా వేయలేక పలువురు.. రోడ్డు దాటుతూ చిగురువాడ, నడవలూరు, రామాపురం, పేరూరు, సి.మల్లవరం, కర్ణాటక, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన పలువురు ప్రమాదాలకు గురై మృతిచెందారు.



వకుళమాత ఆలయం వద్ద ఇరుకుగా జాతీయ రహదారి కూడలి

వినతులకే పరిమితం

ప్రమాదాల తీవ్రతను గుర్తించిన మండలంలోని నాయకులు, ప్రజలు, పలు కళాశాలల విద్యార్థులు వేదాంతపురం కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. అప్పటి ఎంపీ శివప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని చెప్పారు. ఏడాదికి ముందు భాజపా చంద్రగిరి నియోజకవర్గ బాధ్యుడు పురుషోత్తం నాయుడు వేదాంతపురం, రామానుజపల్లి, సి.మల్లవరం పంచాయతీల వద్ద వంతెనలు ఏర్పాటు చేయాలని అప్పటి కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతి సమర్పించారు. డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి సూచించినా ఆ తర్వాత దీనిపై ఎటువంటి కదలిక లేదు. ఆదివారం పేరూరుకు చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి వకుళమాత కూడలి వద్ద అంబులెన్స్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక ఎంపీలు స్పందించి జాతీయ రహదారి కూడళ్ల వద్ద ప్రజలను ప్రమాదాల నుంచి కాపాడడానికి పైవంతెనల ఏర్పాటుకు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వాకర్స్‌కు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అసోసియేషన్ నాయకుడు డా.వీసీ రాయల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. డాక్టర్లు రెడ్డెప్ప, భరత్, వీసీ రావు, ఉమాపతి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కబ్జా నుంచి భూమిని కాపాడండి

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: తిరుపతికి చెందిన ఓ తెదేపా నేత దౌర్జన్యంగా తమ భూమిని కబ్జా చేస్తున్నారని.. పోలీసులు న్యాయం చేయాలని రైల్వే కోడూరు మండలానికి చెందిన తుంగ బాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు.

ఆరోపణలపై పులివర్తి సుధారెడ్డి ఫిర్యాదు

చంద్రగిరి, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని మూడ్రోజులుగా తమపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి ఆదివారం పోలీసుస్టేషన్‌లో ఎస్సై అనితకు ఫిర్యాదు చేశారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు రాకుండా, అభివృద్ధి పనులు అడ్డుకునేందుకు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని మండిపడ్డారు.



ఎస్సై అనితకు ఫిర్యాదు పత్రం అందిస్తున్న పులివర్తి సుధారెడ్డి

బలిజపల్లిని దాటాలంటే హడల్



తిరుపతి - పచ్చికాపల్లం రహదారిలో మండలంలోని బలిజపల్లి వద్ద తేలికపాటి వర్షం వచ్చినా వరద ముంచెత్తుతోంది. వాహనదారులు, పాదచారులు ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే హడలెత్తుతున్నారు. వర్షపునీరు ప్రధాన రోడ్డుతోపాటు బలిజపల్లెకు వెళ్లే రహదారిలో చేరి కుంటను తలపిస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని వాహన చోదకులు, మండల ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రామచంద్రాపురం**



సమావేశంలో పాల్గొన్న బీసీ ఉద్యోగ సంఘాల నేతలు

'వంకీపురం పవన్‌ను గెలిపించుకుందాం'

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తితిదే ఉద్యోగుల సహకార బ్యాంకు ఎన్నికల్లో వంకీపురం పవన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని బీసీ ఉద్యోగుల ఆత్మీయ కలయిక సభలో తీర్మానించారు. ఆదివారం ఓ ప్రైవేట్ హాల్లో బీసీఈఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోపాల్ నేతృత్వంలో సమావేశం జరిగింది. పలువురు బీసీ నేతలు మాట్లాడుతూ.. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన దేవస్థానం ఉద్యోగుల బ్యాంకు ఎన్నికల్లో బీసీలకు తగిన ప్రాధాన్యం ఉండాలంటే వంకీపురం పవన్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకాటి హరికృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు సురేష్, నేతలు మల్లికార్జున, బడి ప్రసన్న యాదవ్, గవ్వల ప్రసాద్, ముని కేశవులు, గిరి శ్రీనివాస్, ఒరుగండ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్, బెంగళూరుకు ప్రత్యేక సర్వీసులు

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపారు. బెంగళూరుకు 23, హైదరాబాద్‌కు 6 మొత్తం 29 సర్వీస్‌లు నడిపినట్లు తిరుపతి కేంద్రీయ బస్ స్టేషన్ సహాయ ట్రాఫిక్ మేనేజర్ డి.రామచంద్ర నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

కనువిందు చేసిన నృత్య ప్రదర్శన

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో దసరా వేడుకల్లో భాగంగా నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన సందర్శకులను కనువిందు చేసింది. ఆదివారం తిరుపతికి చెందిన శివ నాట్య కళానిలయం కళాకారుల భరతనాట్య ప్రదర్శన జరిగింది. పలు సంకీర్తనలకు కళాకారులు చేసిన నృత్యాలు అబ్బురపరిచాయి. ఏవో ఖాదరవల్లి తదితరులు పాల్గొన్నారు.





మూలస్థాన ఎల్లమ్మకు సారె తెస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని, తెదేపా నేత నరసింహయాదవ్ తదితరులు



శక్తిచాముండేశ్వరి పూజలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితరులు

అమ్మవార్లకు ఎమ్మెల్యే నాని సారె సమర్పణ

తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే: శరన్నవరాత్రులు పురస్కరించుకుని మండలంలోని చెంచులక్ష్మి కాలనీలోని మూలస్థాన ఎల్లమ్మకు, ఎల్ఎస్‌నగర్ వద్ద ఉన్న శక్తిచాముండేశ్వరి దేవికి ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం సారె సమర్పించారు. ఆలయ ధర్మకర్తలు ఎమ్మెల్యేలు పులివర్తి నానికి, ఆరణి శ్రీనివాసులుకు, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్‌కు ఘనంగా స్వాగతం పలికి మూలస్థాన ఎల్లమ్మ, శక్తిచాముండేశ్వరి దేవి దర్శనం కల్పించారు. అనంతరం శాలువకప్పి, అమ్మవారి చిత్రపటాన్ని అందించి, తీర్థ ప్రసాదాలతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బిరుదాల సిద్ధారెడ్డి, బి.భాస్కర్‌రెడ్డి, బి.హనుమంతురెడ్డి, బి.తులసీరామిరెడ్డి, కృష్ణారెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, దొడ్ల కరుణాకర్‌రెడ్డి, పేరూరు శ్రీనివాసులు, సుధాకర్, భాను తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ అండ్ ఫీస్ట్ లియో కేఫ్ ప్రారంభం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: స్థానిక తిరుచానూరు రోడ్డులోని మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న ఫైర్ అండ్ ఫీస్ట్ లియో కేఫ్‌ను శనివారం సినీ నటి కృతిశెట్టి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కేఫ్ యజమాని ఎన్.జి.ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.



కేఫ్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి కృతిశెట్టి, పక్కన హోటల్ యజమాని ప్రవల్లిక

విగ్రహాల ప్రతిష్ఠ

తిరుపతి (గ్రామీణ): మండలంలోని చెర్లోపల్లిలో మునీశ్వరస్వామి, గురప్పస్వాముల విగ్రహ ప్రతిష్ఠ భక్తిప్రపత్తులతో జరిగింది. ఆదివారం అర్చకులు హోమపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి విగ్రహాలను అర్చకులు వేద మంత్రాలు, మేళతాళాల నడుమ శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. సర్పంచి సుభాషిణి, శుభగిరినాయుడు, చెర్లోపల్లి, పుదిపట్ల పంచాయతీలోని ప్రజలు పాల్గొన్నారు.

వేడుకగా చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం

తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే: తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం చక్రస్నానం వేడుకగా జరిగింది. ఉదయం అర్చకులు స్వామివారిని పుష్కరిణి వద్దకు వేంచేపుగా తీసుకొచ్చి స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం చక్రత్తాళ్వార్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరిణిలో పుణ్యస్నానం చేయించారు. భక్తులు పుష్కరిణిలో స్నానాలు చేశారు. రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

సమన్వయంతో పని చేద్దాం

తిరుపతి క్రీడలు: శాప్ ఛైర్మన్‌గా రవినాయుడు బాధ్యతలు స్వీకరించాక మొదటిసారి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులను వారి స్వగృహంలో ఆయన కలిశారు. ఎమ్మెల్యే దంపతులను సత్కరించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. నియోజకవర్గంలో పార్టీకి మంచి పేరు వచ్చే విధంగా, సమన్వయంతో క్రీడలను ప్రోత్సహించే విధంగా పనిచేద్దామని పులివర్తి నాని. . రవి నాయుడుకి తెలిపారు.

పోలీసు శాఖలో ఆయుధపూజ

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: విజయదశమి పండుగ సందర్భంగా పోలీసు శాఖలో ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. పోలీసు పరేడ్ మైదానంలో తుపాకులు, ఇతర ఆయుధాలు, వాహనాలు శుభ్రపరిచి పూజలు చేశారు. పోలీసు పెట్రోల్ బంకులోనూ పూజలు నిర్వహించారు. పోలీసులు దినసరి చర్యల్లో భాగంగా ఉపయోగించే ఆయుధాలు, వాహనాలతోపాటు డ్రైవర్లకు ఎలాంటి అపాయం జరగకుండా ఉండాలని పూజలు జరిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, శ్రీనివాసరావు, వెంకటనారాయణ, ప్రసాద్, శ్రీనివాసరావు, రవీంద్ర రెడ్డి, రమణయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మండల నూతన కార్యవర్గం

పాకాల, న్యూస్‌టుడే: సీపీఎం మండల శాఖ అధ్యక్షుడిగా కె.ప్రసాద్, కార్యదర్శిగా ఇ.మధుసూదన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా పార్టీ నాయకురాలు హేమలత సమక్షంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యవర్గ సభ్యులుగా సాత్యకి నాయుడు, ప్రసాద్, నరేంద్ర, లక్ష్మయ్య, సుగుణమ్మను ఎన్నుకున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు, పింఛన్లు ఇవ్వాలని, గృహాలకు నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలని, విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



రాజరాజేశ్వరీదేవిగా తాతయ్యగుంట గంగమ్మ



తిరుపతి(జీవకోన): బొంతాలమ్మ



తిరుపతి(గ్రామీణ): ముత్యాలమ్మ



నేంద్రగుంటలో శ్రీరాజరాజేశ్వరీదేవిగా మూలస్థానమ్మ శోభాయాత్ర

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

చంద్రగిరి, న్యూస్‌టుడే: పుష్పపల్లకీపై మహిషాసురమర్దని స్వరూపంతో శ్రీమూలస్థాన ఎల్లమ్మ, పుష్పపల్లకీలో శ్రీమిట్టగంగమ్మతల్లి శనివారం రాత్రి పట్టణ ప్రధాన వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు.

పాకాల: నేంద్రగుంట శ్రీ మూలస్థాన యల్లమ్మను శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో ప్రత్యేక వాహనం ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. మొబ్బినాయునిపల్లి ద్రౌపదమ్మ ఆలయంలో అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరిదేవిగా పుష్పపల్లకిలో ఊరేగించారు. పాకాల శ్రీసత్యమ్మ ఆలయం, దామలచెరువు పత్తిపాటివారిపల్లి, మొరవపల్లి, వాసవీమాత ఆలయాల్లోనూ దసరా వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

శ్రీకాళీ కాళభైరవ కల్యాణం

రామచంద్రాపురం: సి.గొల్లపల్లిలో ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్‌స్వామి నిర్మించిన సురభి గోశాల్లో జరిగిన శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాల్లో చివరి రోజైన శనివారం శ్రీకాళీ, కాళభైరవ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు అమ్మవారి సారెను అందించారు.



తిరుపతిలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి

పార్వేట ఉత్సవం

తిరుపతి(బైరాగిపట్టెడ): తిరుపతి కొత్త వీధిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు శరన్నవరాత్రుల అనంతరం ఆదివారం వేడుకగా ఆలయం నుంచి సీతమ్మ భూముల వద్దకు చేరుకున్నారు. పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం నగర పురవీధుల్లో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. దేవస్థానం అధ్యక్షుడు పామిడి సత్యనారాయణ శెట్టి, కార్యదర్శి దిండుకుర్తి నరసింహులు, కోశాధికారి శిరీష మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

❖ తిరుపతి తాతయ్యగుంట గంగమ్మను ఆదివారం శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకరణలో నగర పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దంపతులు పాల్గొన్నారు. ఆలయ ఈవో జయకుమార్, మబ్బు దేవనారాయణ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, పులిగోరు మురళి తదితరులు పాల్గొన్నారు.

కాళికమ్మకు పట్టువస్త్రాల సమర్పణ

తిరుపతి(బైరాగిపట్టెడ): స్థానిక కొంకా వీధిలోని కాళికమ్మ ఆలయంలో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ద్వారకామయి శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా ఆలయం నుంచి శ్రీకాళికమ్మ ఆలయానికి ఆలయ గౌరవ అధ్యక్షుడు మబ్బు దేవనారాయణరెడ్డి, కుడితి సుబ్రహ్మణ్యం తదితరులు పట్టువస్త్రాలను సమర్పించారు. రాత్రి శ్రీకాళికాదేవిని నగరంలో ఊరేగించారు.



రామచంద్రాపురం: శ్రీకాళీ కాళభైరవ కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు

బొంతాలమ్మ ఊరేగింపు

తిరుపతి(జీవకోన): గ్రామదేవత శ్రీబొంతాలమ్మకు శనివారం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తి సంగీత విభావరి నిర్వహించి, అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించారు.

ముత్యాలమ్మ గ్రామోత్సవం

తిరుపతి (గ్రామీణ): దుర్గసముద్రం గ్రామంలోని ముత్యాలమ్మకు గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం రాత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సురేంద్రరెడ్డి, శేఖర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల కార్యాలయాల వద్ద గొడవ

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: స్థానిక కోర్టు వీధిలోని న్యాయవాదుల కార్యాలయాల వద్ద ఆదివారం ఉద్రిక్తత నెలకొంది. కొందరు వ్యక్తులు ఆ కార్యాలయాల వద్దకు వచ్చి తాగునీటి బోరు కనెక్షన్, గోడ తొలగించే ప్రయత్నం చేశారు. అక్కడున్న న్యాయవాది ముక్కు సత్యవంతుడు, మరి కొందరు న్యాయవాదులు ఎందుకు ఇలా చేస్తున్నారంటూ అడ్డుకునే యత్నం చేశారు. భవన యజమాని ప్రవీణ్‌కుమార్ రెడ్డి, తెదేపా నాయకుడు శంకరనారాయణ సహాయంతో కొందరు అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యం చేశారని న్యాయవాదులు ఆరోపించారు. కాగా.. న్యాయవాదులు కొన్నేళ్లుగా అక్రమంగా ఉంటున్నారని ఇక్కడి వారు ఆరోపించారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు గాయాలు

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరి ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుపతిలోని ఇంటికి వెళ్తున్న ఎక్సైజ్ శాఖ కానిస్టేబుల్ ఇదయతుల్లాను తొండవాడ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇదయతుల్లా కుడికాలు విరిగింది. చికిత్స నిమిత్తం తొలుత చంద్రగిరి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్యసేవలు అందించారు. తర్వాత అంబులెన్స్‌లో రుయా ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవరు చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని యల్లమంద- ఉస్తికాయలపెంట మార్గమధ్యలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. మండలంలోని జిల్లేలమంద నుంచి బోడేవాండ్లపల్లికి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తుండటంతో ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కి తరలించి.. కేసులు నమోదు చేసినట్టు ఎస్సై ఎర్రిస్వామి తెలిపారు.

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

అగస్తీశ్వరాలయంలో లీకేజీలు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: చిన్నపాటి వర్షానికే అగస్తీశ్వరాలయం పైకప్పు నుంచి లీకేజీతో తడిసి ముద్దయింది. మండలంలోని పెద్దకన్నలి గ్రామంలో వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ఆలయమైన శ్రీ అగస్తీశ్వరాలయంలో ఆదివారం కురిసిన చిన్నపాటి వర్షానికి పైకప్పు నుంచి లీకేజీ సమస్య ఏర్పడడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. గత సంవత్సరంలో వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.12లక్షలతో ఆలయం మరమ్మతులు చేసినప్పటికీ ప్రయోజనం లేదని భక్తులు వాపోతున్నారు. భక్తుల ఇబ్బందుల దృష్ట్యా ఆలయంలో లీకేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోకి పెద్దకన్నలి గ్రామస్తులు విన్నవించుకున్నారు.

ఘనంగా పుట్టాలమ్మదేవికి పొంగళ్లు

శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: తొండమాన్‌పురం సమీపంలో వెలసిన శ్రీపుట్టాలమ్మదేవి ఆలయంలో ఆదివారం ఘనంగా వార్షికోత్సవ పూజలు చేపట్టారు. ప్రతిఏటా దసరా ఉత్సవాల తర్వాత నిర్వహించే పరిసర గ్రామీణ ప్రాంతాల ప్రజలు గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

న్యూస్‌టుడే, నారాయణవనం

సమస్య: అరణ్యంకండ్రిగ పంచాయతీ సుబ్బానాయుడు కండ్రిగలో ట్యాంకు నుంచి తాగునీరు సరఫరా అవుతున్న పైపులైను మరమ్మతుకు గురైంది. దీంతో నీరు వృథా అవుతోంది. తాగునీరు కలుషితమవుతుంది.

– కుమారస్వామి, స్థానికుడు

సమాధానం: మరమ్మతుకు గురైన తాగునీటి పైపులైను బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– మురళి, సర్పంచి

న్యూస్‌టుడే, నాగలాపురం

సమస్య: నాగలాపురం గాంధీవీధిలో బీసీకాలనీకి వెళ్లే మలుపు వద్ద నిత్యం రహదారిపైనే చెత్తా చెదారాలు ఉంటున్నాయి. ఈ ప్రాంతంలో పేరుకున్న చెత్తకు దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

– మునిరాజు, నాగలాపురం

సమాధానం: సిబ్బంది కొరతతో సమస్య నెలకొంది. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం.

– చిన్నదురైసుధ, సర్పంచి, నాగలాపురం



బాలాలయం వెలుపల క్యూలైన్లలో భక్తుల రద్దీ

భక్తులతో కిటకిటలాడిన వేదనారాయణస్వామి ఆలయం

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురం వేదనారాయణ స్వామి ఆలయం శనివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆలయ జీర్ణోద్ధరణ పనుల్లో భాగంగా మూలస్థాన దర్శనం లేకున్నా ఆలయంలో భక్తుల రద్దీ పోటెత్తింది. పెరటాశి నెల శనివారం కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు క్యూలైన్లలో నిలబడి భక్తులు బాలాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ప్రసాదాలను పంపిణీ చేశారు. ఏర్పాట్లను ఆలయాధికారి శ్రీనివాసులు, షరాబు ఉదయకుమార్‌లు పర్యవేక్షించారు.

పల్లె పండుగ విజయవంతం చేద్దాం



నందీశ్వరునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నాగలాపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. సురుటుపల్లి పల్లికొండేశ్వరుని శరన్నవరాత్రి ఉత్సవాల్లో శనివారం ఆయన పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యక్తిగత సమస్యల సమయంలో తనకు అండగా నిలిచిన కార్యకర్తలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. నేతలు, కార్యకర్తలు అందించిన మనోధైర్యంతో తాను ప్రజాసేవకు పునరంకితమవుతానన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో ఈనెల 14వ తేదీన బీఎన్ కండ్రిగ, 15న నారాయణవనం, 16న వరదయ్యపాళెం, 17న నాగలాపురం, 18న సత్యవేడు, 19న కేవీబీపురం, పిచ్చాటూరు మండలాల్లో పర్యటిస్తానన్నారు. నిర్దేశిత పనులకు నేతలు సమన్వయంతో భూమిపూజ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏడు మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక ప్రగతి

ఏర్పేడు, న్యూస్‌టుడే: స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని డీఆర్‌డీఏ వెలుగు పీడీ శోభన్ బాబు తెలిపారు. సోషల్ ఇంటిగ్రేటెడ్ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోబాక పంచాయతీలో మహిళలకు కలంకారీ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 60మంది మహిళలకు శిక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. ఆర్థికాభివృద్ధికి బ్యాంకు నుంచి రుణాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

అల్పపీడనం.. అప్రమత్తమేనా..!

అన్ని శాఖలకు దిశా నిర్దేశం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకునేలా అధికారగణం సంసిద్ధమైంది.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి



గతేడాది వర్షాలకు పొర్లుతున్న గొడ్డేరు కాల్వ (పాతచిత్రం)

నీటి వనరులు పటిష్టమేనా..

వైకాపా అయిదేళ్లల్లో సాగునీటి చెరువులు, కాల్వల పటిష్టతను గాలికి వదిలేసింది. అంతేకాకుండా చెరువుల్లో భారీగా మట్టిని తవ్వేశారు. మూడేళ్లుగా వర్షాకాలంలో వర్షాలకు చెరువులు నిండిపోతూ వచ్చాయి. అయితే ప్రస్తుతం చెరువుల్లో పది శాతం మేరకు నీటి నిల్వలున్నాయి. ప్రస్తుతం భారీ నుంచి అతిభారీ వర్షాలు పడినా పెద్దగా ప్రమాదమేమీ లేకున్నా ప్రత్యేకించి ఒరవ కాల్వలు, తూములు వద్ద ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాల్సి ఉంది. వాగులు, వంకలు పొంగిపొర్లి జనజీవనానికి ఇబ్బందులు కల్పించే పరిస్థితి లేకున్నా అంతటి పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టే దిశగా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది.

పట్టణం.. ప్రశాంతమేనా

వర్షం వస్తే పట్టణ వీధులన్నీ మోకాళ్లలోతు వర్షపు నీళ్లు చేరిపోతున్నాయి. అయితే వర్షాలకు ముందుగా ప్రభుత్వం కాల్వల్లో పూడిక తీతలు చేపట్టేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. కాల్వలు పొంగి పొర్లకుండా, వ్యర్థాలు చేరి అక్కడి జనావాసాల్లో జలమయం కాకుండా అధికారులు అప్రమత్తం కావాల్సి ఉంది. ప్రధానంగా పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధి, సంతమైదానం, సన్నిధి వీధి, న్యూశ్రీరాంనగర్ కాలనీ, బంగారమ్మకాలనీ, దక్షిణకైలాసన్‌నగర్, గజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపైకి వచ్చి ప్రజలు ఇబ్బందులు పడే అవకాశముంది. ఆ పరిస్థితి లేకుండా అధికారులు సన్నాహాలు సిద్ధం చేసుకోవాల్సి ఉంది.

తక్షణ సాయం అవసరం

అల్పపీడన ప్రభావం ఎక్కువగా ఉన్నప్పుడు ఈదురుగాలుల కారణంగా విద్యుత్తుశాఖకు అపార నష్టం కలుగుతుంటుంది. ప్రధానంగా విద్యుత్తు స్తంభాలు పడిపోవడం, విద్యుత్తు తీగలపై చెట్లు పడిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోవడం, కాలిపోవడం తదితర కారణాలతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశముంది. అయితే ఇలాంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు పలు ప్రాంతాలు అంధకారంలో ఉండే అవకాశం ఉంటుంది. ఈ ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంది.



అధికారులతో కలసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి

అన్నిశాఖలు సమన్వయంతో వ్యవహరించాలి

అల్పపీడన ప్రభావం కారణంగా మూడు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి. జిల్లా కలెక్టర్ సూచించిన సూచనల మేరకు జలవనరులు, పురపాలిక, రెవెన్యూ, ట్రాన్స్‌కో, అగ్నిమాపక శాఖలను అప్రమత్తం చేశారు. రైతుల పరంగా నష్టాలు రాకుండా ఉండేలా వ్యవసాయశాఖకు దిశానిర్దేశం చేశాం. డివిజన్ పరిధిలో పది కంట్రోల్ రూములు ఏర్పాటు చేశాం. 24/7 అన్ని శాఖలు అందుబాటులో ఉండేలా అప్రమత్తం చేశాం.

– భానుప్రకాష్‌రెడ్డి, ఆర్డీవో, శ్రీకాళహస్తి

మురుగు తొలగించారు

స్పందనకు వందనం

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని ముసలిపేడు పంచాయతీలో పేరుకు పోయిన మురుగును తొలగించారు. మురుగు కాలువలు పూడి పోవడంతో పాటు కొన్ని చోట్ల కాలువలు లేక పోవడంతో నివాసాల్లోని వ్యర్థపునీరంతా వీధుల్లో ప్రవహిస్తుందని ఈనాడులో ఇటీవల ‘మేమున్నాం- మీకుతోడుగా’ శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు ఆదివారం మురుగు కాలువల్లో పూడిక తీశారు. కొనిచోట్ల జేసీబీతో నూతనంగా కాలువలు తవ్వి నీరు నిల్వ చేరకుండా చర్యలు చేపట్టారు.

గస్తీ ఏర్పాటు

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు పోలీసు గస్తీ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సెలవు దినాలు కావడంతో కొందరు ఆకతాయిలు క్రీడా మైదానంలో మద్యంతాగి బాటిళ్లు పగులకొడుతున్న వైనంపై ‘ఈనాడు’లో శనివారం ‘ మేమున్నాం- మీకుతోడుగా’ శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సీఐ జయచంద్ర ఆదివారం గస్తీని ఏర్పాటు చేశారు.

పారిశుద్ధ్య పరిరక్షణకు చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురం పాఠశాలల సముదాయం వద్ద పారిశుద్ధ్య పరిరక్షణకు సర్పంచి చిన్నదురైసుధ ఆదివారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతంలో రహదారులపైనే చెత్తా చెదారాలతో అధ్వాన పారిశుద్ధ్యంపై ఈ నెల 10వ తేదీన ‘మేమున్నాం.. మీకు తోడుగా’ శీర్షికన ‘ఈనాడు’లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. సిబ్బందితో చెత్తకుండీలు, రహదారులను శుభ్రం చేయించి బ్లీచింగ్‌ను పిచికారీ చేయించారు.

పునరావాస కేంద్రం ఏర్పాటుకు చర్యలు



వేడాం మిట్టకండ్రిగ చెరువుకట్టను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: భారీవర్షాలు కురవనున్నడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాళహస్తి గ్రామీణం సీఐ రవినాయక్ తెలిపారు. మండల అధికారులతో కలసి వేడాం, మిట్టకండ్రిగ పలుగ్రామీణ ప్రాంతాలను ఆదివారం పరిశీలించారు. చిన్నమిట్టకండ్రిగ ప్రాథమిక పాఠశాలను పునరావాస కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. వేడాంతో పాటు పలు చెరువు కట్టలు బలహీనంగా ఉండటంతో మట్టితో పటిష్టంగా మార్చారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, ప్రమాదకర గృహాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో పఠాన్‌రఫీఖాన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

రేణిగుంట: భారీ వర్షాల నేపథ్యంలో రేణిగుంట తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఇన్‌ఛార్జి తహసీల్దార్ శ్యామ్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో లేదా ఎటువంటి అవసరం ఉన్న ప్రజలు తమ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలని కోరారు. స్థానిక వెదళ్లచెరువు ఎస్టీ కాలనీ ప్రజలను అప్రమత్తం చేశారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు ఇక్కడ జలమయమైందని, ప్రజలను స్థానిక పాఠశాలల్లో ఉంచినట్లు తెలిపారు. స్థానికులకు అవగాహన కల్పించి అప్రమత్తం చేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు

తుపానుతో అప్రమత్తంగా ఉండండి

సత్యవేడు, న్యూస్‌టుడే: రానున్న నాలుగు రోజుల పాటు తుపాన్ ప్రభావం అధికంగా ఉంటుందని, అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని స్థానిక తహసీల్దార్ టీవీ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తుపాన్ ప్రభావంపై ముందుస్తు జాగ్రత్తలపై వివిధ శాఖలతో సమీక్ష నిర్వహించారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, మండల పరిషత్ ఇంజినీర్ ఇబ్రహీం ఖాన్, తెలుగు గంగ జేఈలు వెంకటేశ్వర్లు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



బీఎన్‌కండ్రిగలో..



తొట్టంబేడులో..



నెల్లిమానుకండ్రిగలో..



నాగలాపురంలో..



వరదయ్యపాళెంలో..



అంబూరులో..



ఏర్పేడు: గుడిమల్లంలో..



ఏర్పేడు: చిందేపల్లిలో..

ఆధ్యాత్మికత.. వెల్లివిరిసిన భక్తితత్పరత

మహాశివరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజక వర్గాల్లోని దేవాలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో సైతం లేని విధంగా పార్వేట ఉత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ విశేషోత్సవం సందర్భంగా ఆలయ అధికారుల పిలుపుతో పట్టణంలోని పలువురు యువతులు, చిన్నారులు దుర్గాదేవి వేషధారణతో ఉత్సవంలో భాగస్వాములయ్యారు. ఉత్సవానికి ముందు ప్రదర్శనగా సాగారు. 108 దుర్గాదేవి అలంకరణలతో పాటు మహాసరస్వతి, మహాలక్ష్మీ, మహాకాళీ అవతారాలతో ఉత్సవం వెంబడి కొనసాగారు. ఈ విశేషత దృష్ట్యా పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. చిన్నారుల వేషధారణకు పలువురు మంత్రముగ్ధులయ్యారు. పలుగ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

- న్యూస్‌టుడే బృందం





శ్రీకాళహస్తి: దుర్గాదేవి వేషధారణతో ఉత్సవంలో భాగస్వాములైన యువతులు, చిన్నారులు
● శ్రీకాళహస్తి: యువతుల ప్రదర్శనలో ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తదితర అధికారులు



ఏర్పేడు: మర్రిమందలో..



సత్యవేడులో..



సత్యవేడు: వేంకటేశ్వరస్వామి



నారాయణవనంలో..



రాజరాజేశ్వరీదేవిగా..



తిరుచ్చివాహనంపై కల్యాణ వేంకన్న



అపూర్వ సమ్మేళనం

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు పాఠశాల ఆవరణంలో సమావేశమయ్యారు. 2001-02లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఏళ్లతర్వాత ఆదివారం పాఠశాలకు చేరుకుని విద్యార్థి దశలోని తీపిజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. విద్యాబుద్ధిలు నేర్పిన పాఠశాలలో సమస్యలు గుర్తించి తమ వంతుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవయ్య, వనజాక్షి, శ్రీనివాస్ వర్మ, నాగేశ్వరి, సుందరమ్మ, రామచంద్ర, భువనేశ్వరి, ప్రసాద్, గౌస్, మునిరత్నం, భారతి పాల్గొన్నారు.

నేతల మాటల యుద్ధం

శ్రీకాళహస్తి: పట్టణంలోని చాముండేశ్వరి ఆలయం వద్ద శనివారం జరిగిన ఘటన సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పురపాలక సంఘ మాజీ ఛైర్మన్ పార్థసారథి, పులిరామచంద్ర ఇద్దరూ మంచి స్నేహితులు. వైకాపా అధికారంలోకి రాకముందు ఇద్దరూ తెదేపాలో ఉంటూ వచ్చారు. అధికారం వైకాపాకు రావడంతో రామచంద్రా వెళ్లడం, కొన్నాళ్లకు పార్థసారథి అదే పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ పార్థసారథి తెదేపాలో చేరారు. దేవీ శరన్నవరాత్రి వార్షిక ఉత్సవాల సందర్భంగా శనివారం భాస్కరపేటలోని శ్రీచాముండేశ్వరి ఆలయం వేదికగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరు వర్గాలకు చెందిన వాళ్లు కర్రలు, రాళ్లు తదితర వాటితో దాడులకు దిగడంతో అక్కడ కొంత సేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో సర్దుబాటు చేసేందుకు వెళ్లిన ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. అక్కడున్న స్థానికులు సర్దుబాటు చేయడంతో వివాదం సద్దుమణిగింది.



అలంకరణలో జ్ఞానాంబిక

ఘనంగా శాంతి అభిషేకాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కనకాచలంపై శాంతి అభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కలశోద్వాసన సందర్భంగా యాగ కలశాన్ని ఉద్వాసన చేశారు. విశేష పూజా ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు చేపట్టాక కుంభం వేసి ధూప, దీప, నివేదనలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమస్యలపై తక్షణం స్పందించాలి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావం కారణంగా విద్యుత్తు శాఖ అప్రమత్తంగా ఉందని తిరుపతి గ్రామీణ డీఈ వాసురెడ్డి తెలిపారు. విద్యుత్తు సరఫరాతో పాటు ఇతర సమస్యలపై ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో డీఈలు, ఏఈలతో పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా తక్షణం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

రైల్వే కాలనీలో అగ్ని ప్రమాదం



మంటల్లో కాలిన కారు

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట పాత చెక్ పోస్టు సమీపంలోని రైల్వే నివాస సముదాయంలోని ఇంటిలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... రైల్వేశాఖలో పని చేస్తున్న జయకుమార్ శనివారం రాత్రి ఎప్పటిలాగే విధి నిర్వహణ ముగించుకుని ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో తను, భార్య సరస, కుమార్తె జాస్మిన్ నిద్రిస్తున్న సమయంలో పొగ వాసన రావడంతో బయటకు వచ్చి చూడగా కారు మంటల్లో కాలిపోవడంతో కేకలు వేశారు. వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేసే లోపు పక్కనే ఉన్న గదికి అనంతరం ఇళ్లు మొత్తం మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది చేరుకునే సమయానికే పూర్తిగా నష్టం సంభవించింది. విలువైన ఆస్తి పత్రాలు, బంగారం, వెండి, ఇంటి సామాగ్రి మొత్తం కాలిపోయాయి. అయితే ఈ మంటలు కారుకు ఎలా వ్యాపించాయని తెలియాల్సి ఉంది.



కందకం తవ్విస్తున్న ఎస్సై ఈశ్వరయ్య, రెవెన్యూ సిబ్బంది

ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట

తొట్టంబేడు, న్యూస్‌టుడే: స్వర్ణముఖినదిలో ఇసుక అక్రమ తవ్వకాల నియంత్రణకు అధికారులు శనివారం చర్యలు చేపట్టారు. మండలంలోని పెన్నలపాడు సమీపంలోని స్వర్ణముఖినది నుంచి అక్రమ రవాణా సాగిస్తుండడంతో అధికారులు కందకాలు తవ్వించారు. దీంతో అక్రమార్కులు పెద్దకనపర్తి గ్రామానికి సమీపంలో స్వర్ణముఖినది నుంచి ఇసుక రావాణా జరుగుతున్నట్లు శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో స్పందించిన ఆయన తవ్వకాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో పెద్దకనపర్తి వద్ద స్వర్ణముఖిలోకి వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా కందకం తవ్వించారు. అదే సమయంలో అక్కడ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్టేషన్‌కి తరలించారు. ఎస్సై ఈశ్వరయ్య, సీనియర్ సహాయకులు నారాయణ, వీఆర్వో కృష్ణయ్య పాల్గొన్నారు.



బాలకృష్ణ సతీమణి వసుంధరకు వీడ్కోలు పలుకుతున్న ఎమ్మెల్యే సతీమణి రిషితారెడ్డి

శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న బాలకృష్ణ సతీమణి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సినీనటుడు నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఆమెకు శనివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో రాహు, కేతు సర్పదోష నివారణ పూజలను చేయించారు. ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్, ఎమ్మెల్యే సతీమణి ఆమెకు శ్రీకాళహస్తీశ్వరుని జ్ఞాపికను అందజేశారు.

ముక్కంటి సేవలో వీవీఎస్ లక్ష్మణ్

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: భారత్ మాజీ క్రికెటర్ వి.వి.ఎస్. లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చారు. దర్శనార్థం వచ్చిన వీరికి శనివారం ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆలయం తరపున తీర్థ ప్రసాదాలు అందజేశారు.



రావిళ్లవారి కండ్రిగ చెరువులో యంత్రంతో మట్టి తవ్వకాలు

అక్రమార్కులకు సిరుల పండుగ

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడు మండలంలోని రావిళ్లవారికండ్రిగ చెరువు నుంచి కొందరు వ్యక్తులు యథేచ్ఛగా మట్టితవ్వకాలు చేపట్టి బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. శని, ఆదివారాలు సెలవుదినాలు కావడంతో ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు యంత్రాలతో పరిమితికి మించి రాత్రి పగలు తేడా లేకుండా రవాణా చేపట్టారు. నగరి నియోజకవర్గంలోని టీసీ అగ్రహారం, పాదిరేడు పరిసర ప్రాంతాల్లోని ఇసుక బట్టీలకు పెద్దఎత్తున అమ్మకాలు చేపడుతూ సిరులు ఆర్జిస్తున్నారు. చెరువులో బావుల తలపించే గుంతలు ఏర్పడటంతో రానున్న వర్షాకాలంలో పెను ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుమట్టితో వ్యాపారం సాగిస్తున్న అక్రమార్కులపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అసభ్యకర ప్రవర్తనపై దేహశుద్ధి



స్తంభానికి కట్టేసిన దృశ్యం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఆరేళ్ల బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడ్ని విద్యుత్తు స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసిన ఘటన శ్రీకాళహస్తి పట్టణం గాంధీవీధిలో చోటు చేసుకుంది. వీధిలో ఆడుకుంటున్న ఆరేళ్ల బాలికను తొట్టంబేడు మండలం జ్ఞానాంబిక కండ్రిగకు చెందిన అంజూరు మునికన్నా శనివారం నిర్మాణంలో ఉన్న భవనం మీదకు తీసుకెళ్లడాన్ని స్థానికంగా నివాసముంటున్న మహిళ గమనించింది. అయితే వెంటనే చుట్టు పక్కల వాళ్లకు సమాచారం ఇవ్వడంతో స్థానికులు వెళ్లి బాలికను రక్షించారు. నిందితుడైన అంజూర్‌మునికన్నాను విద్యుత్తు స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు పట్టణ సీఐ గోపి నిందితుడ్ని ఆదివారం న్యాయ స్థానంలో హాజరు పరచిన అనంతరం 15 రోజుల పాటు రిమాండ్‌కు తరలించారు.

రెండు కార్లు ఢీ

శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: ఎదురెదురుగా వస్తున్న రెండుకార్లు ఢీ కొట్టడంతో ప్రయాణికులు గాయపడిన ఘటన ఏర్పేడు-వెంకటగిరి ప్రధాన రహదారిపై జగ్గరాజుపల్లి సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ రవినాయక్ కథనం మేరకు.. తిరుపతి నుంచి బాలాయపల్లికి వెళ్తున్న కారు, ఏర్పేడు వైపు వస్తున్న మరో కారు అదుపుతప్పి ఢీ కొన్నాయి. ఈ ఘటనలో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు



మొదటి రకం: కేజీ రూ. 40 నుంచి రూ. 60 వరకు

రెండో రకం: కిలో రూ. 30 నుంచి రూ. 40 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	143
లేయర్	120
బ్రాయిలర్స్	254
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	280
లేయర్ మాంసం	204

ముక్కంటి సేవలో వీవీఎస్ లక్ష్మణ్.. శ్రీకాళహస్తి: భారత్ మాజీ క్రికెటర్ వి.వి.ఎస్.లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చారు. వీరికి శనివారం ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆలయం తరపున తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పల్లె పండుగ నేడు.. దొరవారిసత్రం: మండలంలోని మినమనమూడి, శ్రీధనమల్లి, తొగరామూడి పంచాయతీల్లో స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సోమవారం 'పల్లె పండుగ' కార్యక్రమం జరుగుతుందని మండల తెదేపా అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులునాయుడు ఆదివారం తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966

సమయం 10 AM TO 1 PM

నాయుడుపేట పట్టణం

సమస్య: నాయుడుపేట దర్గా కూడలిలో రోడ్డు పక్కన కొబ్బరి బోండాలు కొట్టి వృథాగా పడేయటంతో వాటిల్లో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి.
– మహేష్, వ్యాపారి

సమాధానం: కొబ్బరి బోండాలు వెంటనే తొలగిస్తాం.
– ఫజులుల్లా, పుర కమిషనర్, నాయుడుపేట

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: గూడూరులోని రాణిపేట ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
– రాఘవ, గూడూరు

సమాధానం: సిబ్బందిని పంపి వీధి దీపాల ఏర్పాటు చేస్తాం. – వెంకటేశ్వర్లు, పుర కమిషనర్, గూడూరు

చెత్త తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పురపాలక పరిధిలోని సాధుపేట ప్రాంతంలో ప్రధాన రహదారిపై చెత్తాచెదారాలు అధికంగా ఉండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యపై 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ఈ నెల 10న వార్త ప్రచురితమైంది. స్పందించిన పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు చెత్తను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో శమీపూజ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని నాగేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్వామివారికి శమీ పూజ నిర్వహించారు. ఆలయ మాజీ ఛైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, పట్టణ తెదేపా అధ్యక్షుడు ఆకుతోట రమేష్ పాల్గొన్నారు. అదే రోజు రాత్రి శివపార్వతులను పుర వీధుల్లో ఊరేగించారు.




ముఖద్వార నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

రూ.50లక్షలతో పోలేరమ్మ ఆలయ ముఖద్వారం

వెంకటగిరి, న్యూస్‌టుడే: వెంకటగిరి క్రాస్‌రోడ్డులో పోలేరమ్మ ముఖద్వార నిర్మాణానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోలేరమ్మ తల్లి ముఖద్వార నిర్మాణానికి సొంత నిధులు రూ.50 లక్షలు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. ఆధునిక పద్ధతులతో ఈ నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. పాలకేంద్రం, కాంపాళెం మార్గంలో కూడా ముఖద్వారాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వరరావు, ప్రసాద్, ఆనంద్, సత్యనారాయణ, భాస్కర్‌రెడ్డి, తోట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు కోతలు.. ప్రజలకు వెతలు



తుంగపాలెం వద్ద పిచ్చిమొక్కల మధ్య విద్యుత్తు నియంత్రిక

క్షేత్రస్థాయిలో కానరాని అధికారుల పర్యవేక్షణ ♦ చినుకు పడినా.. గాలి వీచినా సరఫరాలో అంతరాయం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో చిన్న వర్షానికే విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. మరోవైపు గ్రామాల్లోని ఏ వీధిలో చూసినా విద్యుతు తీగలు వేలాడుతూ దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం, పర్యవేక్షణా లోపం కారణంగా విద్యుత్తు నియంత్రికల చుట్టూ ముళ్ల చెట్లు పెరుగుతున్నాయి. అయినా పట్టించుకునేవారు కరవయ్యారని ప్రజలు వాపోతున్నారు. వైకాపా పాలనలో నాయకులతో అంటకాగి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన డిస్కం అధికారులు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వారి తీరు మారడం లేదు.

గూడూరు డివిజన్ పరిధిలో తరచూ విద్యుత్తు సమస్యలు తలెత్తడంతో వినియోగదారులకి ఇబ్బందులు తప్పడం లేదు. డివిజన్‌లో గూడూరు పట్టణం, 8 మండలాలున్నాయి. చిన్నపాటి సమస్య వచ్చినా గంటల కొద్దీ సరఫరా నిలపడం పరిపాటిగా మారింది. ఏఈలు లేకపోవడంతో మండలాల్లో సెక్షన్ ఇంజినీర్లు, గ్రామీణ ప్రాంతాల్లో లైన్‌మెన్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వినియోగదారులకు ఇక్కట్లు తప్పడం లేదు.

డివిజన్ - గూడూరు
సెక్షన్లు-12
మండలాలు: 9
సబ్‌స్టేషన్లు: 46
మొత్తం త్రిఫేజ్, సింగిల్ ఫేజ్ నియంత్రికలు: 18,248

ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి

కింది స్థాయి ఉద్యోగులను పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో విద్యుత్తు సమస్యలు పునరావృత్తం అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలంలో రాత్రి సమయాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోతే ఎప్పుడు వస్తోందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. సబ్ స్టేషన్ పరిధిలో సిబ్బందిని ప్రజలు అడిగితే మెయిన్ సప్లై ఆగిపోయిందంటూ వినియోగదారులకు నిర్లక్ష్యపు సమాధానాలు చెబుతున్నారనే ఆరోపణలున్నాయి. అక్రమ లేఅవుట్లు, అనధికార భవనాలకు ఆఘ మేఘాలపై స్తంభాలు, విద్యుత్తు తీగలు అమర్చడంలో ముందుండే డిస్కం అధికారులు, సామాన్య ప్రజలకు అంతరాయం కలిగితే మాత్రం రోజుల కొద్దీ కాలం వెల్లదీస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం

విద్యుత్తు సరఫరాలో వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. దురుసుగా ప్రవర్తించినా చర్యలు తీసుకుంటాం. సరఫరాలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు అందిస్తాం.

- నరేంద్రరెడ్డి, ఈఈ, గూడూరు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

వైభవంగా గ్రామోత్సవం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణంలో దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు పలు ఆలయాల్లో అమ్మవారి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవాద్యాలు, మేళతాళాలు, విద్యుత్ దీపాలంకరణల మధ్య అమ్మవారిని పురవీధుల్లో గ్రామోత్సవాలను నిర్వాహకులు నిర్వహించారు. నారాయణమ్మ, మహాలక్ష్మమ్మ, ద్రౌపదీదేవి, రెండో పట్టణంలోని మహాలక్ష్మి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



దుస్తులు అందజేస్తున్న ట్రస్ట్ ఛైర్మన్ కల్యాణ్‌రెడ్డి

పేదలకు దుస్తుల పంపిణీ

పెళ్లకూరు, న్యూస్‌టుడే: శిరసనంబేడు ఎస్సీ, ఎస్టీ కాలనీవాసులకు విజయదశమి సందర్భంగా కేర్ ట్రస్ట్ ఛైర్మన్ వేలూరు కల్యాణ్‌రెడ్డి శనివారం దుస్తులు పంపిణీ చేశారు. 200 మందికి చీరలు, దుస్తులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు మురళీకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు..

చిల్లకూరు, న్యూస్‌టుడే: చేడిమాల గ్రామానికి చెందిన రాజనేని రామానాయుడు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దసరా సందర్భంగా శనివారం నలుగురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లతోపాటు మహిళకు తోపుడు బండిని అందజేశారు. ట్రస్టు ప్రతినిధులు రామానాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, చంద్రయ్యనాయుడు, బాబు పాల్గొన్నారు.

తుపాను హెచ్చరికలతో అప్రమత్తం

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: తుపాను హెచ్చరికల నేపథ్యంలో దొరవారిసత్రం మండలంలోని కాళంగి నదీ పరివాహక ముంపు ప్రాంత గ్రామాలైన బురదమడుగు, వేటగిరిపాళెం, తల్వంపాడు, తనయాలి, వెదురుపట్టు తీర ప్రాంత గ్రామాలైన మీజూరు, కారికాడు, వేలూరు, కట్టువపల్లి గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక తహసీల్దారు శైలకుమారి సూచించారు. ఆదివారం తమ సిబ్బందితో కలిసి ఆ గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. **వాకాడు:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా సూచించారు. ఆదివారం ఆయన వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. **సూళ్లూరుపేట:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో సూళ్లూరుపేట డివిజన్‌లో అధికారులను అప్రమత్తమయ్యారు. డివిజన్ పరిధిలోని అన్ని శాఖల అధికారులతో సూళ్లూరుపేటలో ఆర్డీవో కిరణ్మయి ఆదివారం సమావేశమయ్యారు. ముందస్తు జాగ్రత్తపై ఆమె చర్చించారు. **నాయుడుపేట:** అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉండడంతో నాయుడుపేట మండలంలో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. తహసీల్దారు, మండల పరిషత్ కార్యాలయాల్లో వివిధ శాఖలకు చెందిన అధికారులు సమావేశమయ్యారు.



దొరవారిసత్రం: స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దారు శైలకుమారి



వాకాడు: పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా



సూళ్లూరుపేట: కాళంగి రిజర్వాయర్ వద్ద ఇంజినీర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో

వాకాడులో ఎద్దుల బండ్ల పోటీలు

వాకాడు: వాకాడు, కోట, చిట్టమూరు మండలాల రైతులు ఆదివారం వాకాడు ఐటీఐ కళాశాల ఆవరణలో ఎద్దుల బండ పోటీలు నిర్వహించారు. పలు రైతులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజయదశమి వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు దువ్వూరు మధురెడ్డి, హరిష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 318 దరఖాస్తులు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 21 మద్యం దుకాణాలకుగాను 318 దరఖాస్తులు అందాయి. గురువారం నాటికి 21 దుకాణాలకుగాను 162 దరఖాస్తులు రాగా శుక్రవారం నాటికి వాటి సంఖ్య 318కి చేరింది. ఇందులో తడలో అత్యధికంగా ఐదు దుకాణాలకుగాను 141 దరఖాస్తులు వచ్చాయి. సూళ్లూరుపేటలో 14 దుకాణాలకు 142, దొరవారిసత్రంలో రెండు దుకాణాలకు 35 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం తిరుపతిలో లాటరీ పద్ధతిలో దుకాణాలను అధికారులు కేటాయించనున్నారు.



కోట: కోటమ్మ దేవత



వెంకటగిరి: నెమలి ఫించం చీరలో అమ్మవారు



నాయుడుపేట రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో దుర్గామల్లేశ్వర అమ్మవారు



చిల్లకూరు: కలవకొండలో..



సూళ్లూరుపేట: మహిషాసుర మర్దని అలంకారంలో చెంగాళమ్మ

ముగిసిన దేవీ శరన్నవరాత్రులు

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. దశమి సందర్భంగా వ్యాపారులు, నివాసితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవార్లకు విశేషాలంకరణలు చేశారు. వెంకటగిరిలో పర్వతవర్ధిని అమ్మవారికి నెమలి ఫించ చీర, పసుపు, కుంకుమలతో తయారు చేసిన మాల విశేషంగా ఆకట్టుకుంది. - న్యూస్‌టుడే బృందం



వెంకటగిరి: పురవీధుల్లో సాయినాథుడి నగరోత్సవం

వేడుకగా పెరటాశి మాసం పూజలు

తడ, న్యూస్‌టుడే: చిన్నమాంబట్టు కాశీవిశ్వేశ్వరాలయంలో అన్నపూర్ణాదేవి అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో పెరటాశి మాసం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆములూరు నాగరాజకుమారి కుటుంబ సభ్యులు గోపూజ, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కారణి సోమసుందరం మహర్షి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వైద్య శిబిరం నిర్వహించి, రోగులకు ఉచితంగా ఆయుర్వేద మందులు, లేపనాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకులు డా.పద్మజ మునుస్వామి దంపతులు, గ్రామపెద్దలు ఈశ్వర్‌రెడ్డి, నందారెడ్డి, భాస్కర్, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిన్నమాంబట్టు అన్నదాన మందిరంలో జ్యోతి వెలిగిస్తున్న గ్రామపెద్దలు

లక్ష తమలపాకులతో పూజలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: శ్రీహరికోట రోడ్డులోని కేఆర్పీ వద్ద ఉన్న సాయి సన్నిధి సత్సంగ మందిరంలో దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. షిరిడీ సాయి బాబా 106వ మహా సమాధి సందర్భంగా 108 కొబ్బరికాయల నీటితో బాబాకు అభిషేకాలు నిర్వహించి 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించారు. సాయినాథునికి సహస్ర నామాలతో లక్ష తమలపాకుల పూజలు చేశారు.



సాయిబాబా గుడిలో తమలపాకుల పూజలో భక్తులు

మునిమందలమ్మ ఆలయంలో పూజలు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: శిరసనంబేడు గ్రామశక్తి శ్రీమునిమందలమ్మ ఆలయంలో అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా స్థానికులు సామూహిక పొంగళ్లు పెట్టి అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు అన్నదానం నిర్వహించారు. వేలూరు మురళీరెడ్డి, బీసీ నాయకులు ప్రసాద్, సుందరరామిరెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

ఆదమరిస్తే కాలువలోకే..!



కోట మండలంలోని విద్యానగర్-కొత్తపాళెం ర.భ రోడ్డులో నిర్మించిన కల్వర్టుకు రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. కల్వర్టు ఉందనే సూచిక బోర్డులు సైతం ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహన దారులు రాత్రివేళల్లో ఏమాత్రం అజాగ్రత్తగా వాహనాలు నడిపినా కాలువలోకి వెళ్లే పరిస్థితి ఉంది. ఇటీవల పలువురు వాహనచోదకులు కాలువలో పడి ఆసుపత్రి పాలైన ఘటనలున్నాయి. ఈ విషయమై ర.భ అధికారులను వివరణ కోరగా సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, కోట

నీటి వృథా.. తప్పదు వ్యథ



నాయుడుపేట పురపాలక సంఘం నరసారెడ్డి కండ్రిగలో రోడ్డు పక్కన ఉన్న పైపులైను నుంచి తాగునీరు వృథాగా పోతోంది. ఇక్కడున్న 70 గృహాలకు స్థానిక చంద్రబాబునగర్ నుంచి నీరు సరఫరా చేస్తున్నారు. ఇళ్లకు నీరు సరఫరా చేసే సమయంలో పైపులైను నుంచి ఇలా నీరు వృథాగా పోతోంది. నీటి వృథాను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ ఫజులుల్లాను వివరణ కోరగా సమస్యను పరిశీలించి తాగునీటి వృథాను కట్టడి చేస్తామన్నారు.

- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

ప్రమాదకరంగా నియంత్రిక

నాయుడుపేట పురపాలకం నరసారెడ్డి కండ్రిగ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో చెరువు కలుజు వద్ద విద్యుత్తు నియంత్రిక వాలిపోయి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడైనా పడిపోయే పరిస్థితి నెలకొంది. విద్యుత్తు శాఖ అధికారులు బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం



ప్రమాదమని తెలిసినా ఇంతే..!



ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన.. నిర్లక్ష్యం కారణంగా నిత్యం ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా కొందరి తీరులో మార్పు రావడం లేదు. మాంబట్టు సెజ్‌రోడ్డులో ట్రక్కు ఆటోలో డీజిల్ ఖాళీ కావడంతో ఓ ద్విచక్రవాహన చోదకుడు అత్యుత్సాహంతో శక్తికి మించి ఇలా ప్రమాదకరంగా కాలితో ట్రక్కును తోస్తూ న్యూస్‌టుడే కెమెరాకు చిక్కారు. - న్యూస్‌టుడే, తడ

పార్కింగ్ కష్టాలు..!

కోట, న్యూస్‌టుడే: కోట, చెందోడు పంచాయతీల్లో వాహనాలకు పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇరుకు రోడ్లతోపాటు రద్దీగా ఉండటంతో తరచుగా ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు పదేళ్లుగా ప్రతిపాదనలు పంపుతున్నా.. ఫలితం శూన్యం.

● కోట మేజరు పంచాయతీలో 10వేలకు పైగా జనాభా ఉన్నారు. నగర పంచాయతీ ఏర్పాటుకు ప్రతిపాదనలున్నాయి. అంతేకాక విద్యానగర్ నుంచి కోట కొత్తచెరువు వరకు ర.భ రోడ్డు పక్కనే ఇరువైపులా వందల దుకాణాలు ఉన్నాయి. అలాగే కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలకు చెందిన

ప్రతిపాదనలతో కాలయాపన

ప్రజలు పనుల నిమిత్తం తరచూ కోటకు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో వాహనాల రద్దీ అధికమే. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు తమ వాహనాలను నిలపడానికి స్థలం లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

ఉన్నతాధికారులకు నివేదించాం

పార్కింగ్ విషయమై ప్రతిపాదనలు పంపాం. తహసీల్దారు దృష్టికి తీసుకువెళ్లి స్థల సేకరణ చేపడతాం.

- వెంకటరమణ, డీఎల్‌పీవో



మెయిన్‌రోడ్డులో అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలు

● చెందోడు పంచాయతీ పరిధిలోని విద్యానగర్ విద్యాసంస్థలకు నిలయంగా ఉంది. ఇక్కడ దుకాణాలూ అధికమే. వేలాది మంది విద్యార్థులు, ప్రజలు వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. కోట, వాకాడు, నాయుడుపేట, గూడూరు మార్గాల్లో వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. ఇక్కడ కూడా వాహనాల పార్కింగ్ పెద్ద సమస్యగా మారింది.

పాఠశాల ప్రాంగణం బాగుకు చొరవ

చిల్లకూరు, న్యూస్‌టుడే: పాలిచర్లవారిపాలెం ఉన్నత పాఠశాల ప్రాంగణం బాగుకు మేఘా ఇంజినీరింగ్ కంపెనీ చొరవ చూపింది. ప్రాంగణం లోతట్టులో ఉండటంతో వర్షం వస్తే నీరు నిలిచి మడుగును తలపిస్తోంది. దీంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యే వారు. స్థానికులు, పాఠశాల ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు పాఠశాలలో ఆదివారం మట్టిని తోలి మైదానం చదును చేశారు.



మట్టి తోలి చదును చేస్తున్న యంత్రం

మున్సిపల్ వైస్ ఛైర్మన్‌కు పితృవియోగం

నాయుడుపేట, న్యూస్‌టుడే: నాయుడుపేట పురపాలక వైస్ ఛైర్మన్, తెదేపా నేత షేక్ రఫీ తండ్రి చాన్‌బాషా(60) ఆదివారం మృతి చెందారు. ఆయన నివాసంలో పార్థీవదేహానికి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, జనసేన కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, నెలవల రాజేష్ తదితరులు నివాళి అర్పించారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

వెంకటగిరి, న్యూస్‌టుడే: వెంకటగిరి-నాయుడుపేట మార్గంలోని కృషి విజ్ఞాన కేంద్రం మలుపు వద్ద శనివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వెంకటగిరి నుంచి శ్రీను అనే వ్యక్తి ద్విచక్రవాహనంలో పెట్లూరుకు వెళ్తుండగా పంజాం గ్రామానికి చెందిన యువకుడు ద్విచక్రవాహనంలో వస్తూ ఇద్దరూ ఢీకొన్నారు. ప్రమాదంలో శ్రీనుకు తీవ్రగాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై సుబ్బారావు తెలిపారు.

రెండు కార్లు.. శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు): ఎదురెదురుగా వస్తున్న రెండుకార్లు ఢీ కొట్టడంతో ప్రయాణికులు గాయపడిన ఘటన ఏర్పేడు-వెంకటగిరి ప్రధాన రహదారిపై జగ్గరాజుపల్లి సమీపంలో శుక్రవారం అర్ధ రాత్రి చోటు చేసుకుంది. సీఐ రవినాయక్ కథనం మేరకు.. తిరుపతి నుంచి బాలాయపల్లికి వెళ్తున్న కారు, ఏర్పేడు వైపు వస్తున్న మరో కారు అదుపుతప్పి ఢీ కొన్నాయి. ఈ ఘటనలో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.